## ఇక భారత్‌లోనే హామర్ స్మార్ట్ బాంబుల తయారీ..

# ఫ్రాన్స్‌తో బీఈఎల్ కీలక ఒప్పందం

భారత రక్షణ రంగం ఆత్మనిర్భరత దిశగా మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే 'హామర్' స్మార్ట్ బాంబులను తయారు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ , ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ ఎలక్ట్రానిక్స్ %ఒ% డిఫెన్స్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై బీఈఎల్ సీఎండీ మనోజ్ జైన్, సఫ్రాన్ ఈవీపీ అలెగ్జాండర్ జీగ్లర్ సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థలు కలిసి 50:50 వాటాలతో ఒక జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేయనున్నాయి. గతంలో 2025 ఫిబ్రవరిలో జరిగిన ఏరో ఇండియా ప్రదర్శన సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందం ఇప్పుడు కార్యరూపం దాల్చింది. హామర్ అనేది ఫ్రాన్స్‌కు చెందిన అత్యంత అధునాతన ఎయిర్-టు-గ్రౌండ్ స్మార్ట్ బాంబు. రఫేల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగిస్తే ఇది 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు బంకర్లు, కమాండ్ సెంటర్లు, రాడార్లను కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. గగనతలంలో తన మార్గాన్ని మార్చుకోగల సామర్థ్యం, జామింగ్‌ను తట్టుకోగల శక్తి దీని సొంతం. ఈ ఒప్పందం వల్ల 'మేకిన్ ఇండియా' కార్యక్రమానికి పెద్దపీట వేసినట్లయింది. తొలుత కొన్ని విడిభాగాలను ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్నా, దశలవారీగా 60 శాతం ఎలక్ట్రానిక్, మెకానికల్ భాగాలను దేశీయంగానే తయారు చేస్తారు. తయారీ, పరీక్ష, నాణ్యత నియంత్రణ బాధ్యతలను బీఈఎల్ చూసుకోనుంది. దీనివల్ల భారత వాయుసేన, నౌకాదళం అవసరాలకు విదేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అలాగే తేజస్ యుద్ధ విమానాల్లోనూ వీటిని అమర్చే అవకాశం ఉంటుంది. త్వరలోనే ఈ అత్యంత శక్తివంతమైన ఆయుధం భారత గడ్డపై తయారీ కానుంది.

## నన్ను చాలెంజ్ చేస్తే.. బీజేపీ పునాదులే కదిలిస్తా : సీఎం మమత

మొదటి పేజి తరువాయి

మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తనను చాలెంజ్ చేస్తే దేశంలో బీజేపీ పునాదులు కదిలిస్తానని మమత వ్యాఖ్యానించారు. బొంగావ్‌లో జరిగిన ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగిస్తూ, రాష్ట్రంలోని మతువా-మెజారిటీ ప్రాంతాలలోని ఓటర్లు పౌరసత్వం (సవరణ) చట్టం ప్రకారం తమను తాము విదేశీయులుగా ప్రకటిస్తే వారిని "వెంటనే జాబితా నుండి తొలగిస్తారు" అని కూడా మమతా బెనర్జీ పేర్కొన్నారు. బీజేపీ రాజకీయంగా తనను ఓడించలేదని గతంలోనే పదిసార్లు చెప్పానని మమత మరోసారి నొక్కి వక్కాణించారు. అంతేకాదు ఎన్నికల కమిషన్ ఇకపై నిష్పాక్షిక సంస్థ కాదు, కానీ బిజెపి కమిషన్‌గా మారిపోయిందంటూ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)పై విమర్శలు గుప్పించారు. "అక్రమ బంగ్లాదేశీయులను" తొలగించడమే లక్ష్యమైతే, బిజెపి పాలిత రాష్ట్రాల్లో SIR ఎందుకు నిర్వహిస్తు న్నారని మమత ప్రశ్నించారు. అంటే పార్టీ "డబుల్ ఇంజిన్ పాలిత రాష్ట్రాల్లో కూడా చొరబాటుదారులు ఉన్నారని అంగీకరిస్తుందా అని ఆమె ఎద్దేవా చేశారు. తానుఒక దేశంగా బంగ్లాదేశ్‌ను ప్రేమిస్తున్నానని తమ భాషా ఒకటేనని చెప్పారు. ఏదో ఒకరోజు తనను కూడా బంగ్లాదేశీ అని పిలుస్తారని విమర్శించారు. ఈ రాష్ట్రం నుంచి ఈ జాబితా ప్రకారమే 2024లో ప్రధాని మోదీ ఓట్లు గెల్చుకున్నారు. మరి ఆ ఓట్లు తీసేస్తే కేంద్ర ప్రభుత్వం కూడా తొలగించాలా కదా అన్నారు. అసలు సర్ నిర్వహణకు ఎందుకు ఇంత తొందర పడుతున్నారని సీఎం మమత ప్రశ్నించారు. "నేను ఇక్కడ ఉన్నంత వరకు, వారు మిమ్మల్ని వెళ్లగొట్టడానికి నేను అనుమతించను. ఎవరూ మిమ్మల్ని వెళ్లగొట్టలేరు" అంటూ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇక్కడ బంగ్లాదేశీలే సమస్య అయితే, మధ్యప్రదేశ్ , యుపీలో SIR ఎందుకు నిర్వహిస్తున్నారు? అని మమతా అటు ఈసీపైనా, ఇటు బీజేపీపైనా నిప్పులు చెరిగారు. కాగా ఇటీవలి బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం తరువాత బిహార్ గెలిచేశాం. ఇక పశ్చిమ బెంగాల్ వంతు అని బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలకే కౌంటర్‌గానే మమతీ ప్రతిసవాల్ చేసినట్టుగా భావిస్తున్నారు.

## ముంచుకొస్తున్న మరో తుపాను...
## రైతులను అప్రమత్తం చేసిన అచ్చెన్నాయుడు

రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, వాయుగుండంగా మారి రానున్న 48 గంటల్లో తుపానుగా బలపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పంట నష్టం జరగకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వరి కోతలు పూర్తిచేసిన రైతులు, తమ ధాన్యాన్ని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం తడవకుండా కాపాడు కునేందుకు ప్రభుత్వం తరఫున రైతులకు ఉచితంగా టార్పలిన్ పట్టాలు పంపిణీ చేస్తున్నామని అచ్చె న్నాయుడు వెల్లడించారు. రైతులు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించి వాటిని పొందవచ్చని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదే శించారు. సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తీరానికి తిరిగి రావాలని ఆదేశించారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బ ందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## డిసెంబరు 6 నుంచి అమెరికాలో
## నారా లోకేశ్ పర్యటన... 8 వేల మందితో భారీ సభ!

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. డిసెంబర్ మొదటి వారంలో ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలోకి కొత్త పరిశ్రమలను ఆహ్వానించడంతో పాటు, ప్రవాసాంధ్రులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఖరారైన షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు లోకేశ్ అమెరికాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా తొలిరోజు డిసెంబర్ 6న డల్లాస్‌లో 'తెలుగు కమ్యూనిటీ విత్ నారా లోకేశ్' అనే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూ యార్క్ వంటి నగరాల్లోనూ పర్యటించి పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఈ పర్యటనలో భాగంగా డల్లాస్‌కు సమీపంలోని గార్లాండ్‌లో ఉన్న కర్టిస్ కల్వెల్ సెంటర్‌లో ఒక భారీ సభను నిర్వహిం చనున్నారు. దాదాపు 8 వేల మంది ప్రవాసాంధ్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, కెనడా నుంచి కూడా పలువురు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, పెట్టుబడులతో భాగ స్వాములు కావాలని లోకేశ్ ఈ సభలో ప్రవాసాంధ్రులను కోరనున్నారు. టెక్, ఐటీ రంగాల్లో అవకాశాలు, యు వ నాయకత్వం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడం పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవల విశాఖ పట్నం లో జరిగిన సీఐఐ సదస్సులో రూ.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించినట్లు ప్రభుత్వం ప్రకటిం చిన విషయం తెలిసిందే. ఈ స్ఫూర్తితోనే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు తాజా పర్యటన చేపడుతున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025
## : 25 నుంచి సీఎం సమీక్షా సమావేశాలు

హైదరాబాద్: డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నేటి నుంచి సమీక్షా సమావేశాలు జరుగనున్నాయి. ప్రతి రోజు వేర్వేరు అంశాలపై అధికారులు, మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు.

నవంబర్ 25 – సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లు

సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సంబంధిత విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు పాల్గొని సమ్మిట్ నిర్వహణ, కీలక కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. నవంబర్ 26న లాజిస్టిక్స్, ఇతర ఏర్పాట్ల గురించి సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొంటారు. సమ్మిట్‌కు వచ్చే దేశీయ, విదేశీ ప్రతినిధుల రవాణా, నివాసం, భద్రత వంటి లాజిస్టిక్స్ అంశాలపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. నవంబర్ 27న జరగనున్న సమావేశానికి మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కానున్నారు. సమ్మిట్ వేదిక, రోడ్లు, కమ్యూనికేషన్, విద్యుత్, అతిథి సదుపాయాలు మొదలైన మౌలిక వసతులపై అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వనున్నారు. నవంబర్ 28న సాయంత్రం 4 గంటలకు సీఎం, మంత్రి వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి పాల్గొని విద్యాసంస్థల భాగస్వామ్యం, యువజన కార్యక్రమాలపై సమీక్షిస్తారు. దాంతో పాటు ఆ రోజు సాయంత్రం 6 గంటలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ పాల్గొని పర్యాటక ప్రోత్సాహక ప్రణాళికలను పరిశీలించనున్నారు. నవంబర్ 29న సాయంత్రం 4 గంటలకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి పాల్గొనబోతున్నారు. రైతులకు కొత్త అవకాశాలు, సమ్మిట్‌లో అగ్రి-ఇన్నోవేషన్ సెషన్లపై చర్చించనున్నారు. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్ పాల్గొని సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించనున్నారు. నవంబర్ 30న సీఎంతో పాటు ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనరసింహ, సంబంధిత అధికారులు పాల్గొననున్నారు. రాష్ట్రంలోని హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెడికల్ టూరిజం అవకాశాలు, గ్లోబల్ హెల్త్ సెషన్లపై సమగ్ర సమీక్ష జరుగుతుంది.

## ప్రపంచకప్ విజేతలకు ప్రధాని అభినందన

మొదటి పేజి తరువాయి

ఆదివారం టీమిండియా 7 వికెట్ల తేడాతో నేపాల్‌పై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. 'మొదటిసారి జరిగిన అంధుల మహిళల టి20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టుకు అభినందనలు. ఓటమి ఎరగకుండా ట్రోఫీ నెగ్గడం మరింత గొప్పవిషయం. ఇది నిజంగా చారిత్రాత్మక విజయం. జట్టు సమష్టి కృషి, పట్టుదలకు ఇది నిదర్శనం. ప్రతీ క్రీడాకారిణీ ఒక చాంపియన్. ఈ ఘనత రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది' అని ప్రధాని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై విజయం సాధించిన భారత్ అంతకుముందు లీగ్ దశలో శ్రీలంక, ఆస్ట్రేలియా, నేపాల్, అమెరికా, పాకిస్తాన్‌పై నెగ్గింది. అదే విధంగా.. మహిళల కబడ్డీ ప్రపంచకప్ టోర్నీలోనూ

## ప్రపంచ మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న 18 పంటలు ఈ ప్రాంతంలో పండుతున్నాయి

మొదటి పేజి తరువాయి

ప్రపంచ మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న 18 రకాల పంటలు ఈ ప్రాంతంలో పండుతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రైతుల జీవన ప్రమాణాలు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు సచివాలయంలో పూర్వోదయ పథకం కింద రాయలసీమ ఉద్యాన పంటల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.

రూ.40 వేల కోట్లతో బృహత్ ప్రణాళిక

రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలోని 9 జిల్లాల్లో ఉద్యాన రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ భారీ ప్రణాళికను అమలు చేయనుంది. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఈ ప్రాంతంలోని రహదారులు, జలవనరుల ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీని ద్వారా 92 క్లస్టర్లలోని సుమారు 5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా సాగు నుంచి మార్కెటింగ్ వరకు వివిధ దశల్లో రైతులకు అండగా



నిలిచేందుకు రూ.14,800 కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టనున్నామని, ఇందులో రూ.9,000 కోట్లను సబ్సిడీ రూపంలో అందించనున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా తీర్చిదిద్దడమే లక్ష్యం

"రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా తీర్చిదిద్దటమే మన లక్ష్యం. ఈ ప్రాంతంలో మొత్తం 65 రకాల ఉద్యాన పంటలు పండుతుండగా, ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న 18 రకాల పంటలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. 50 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. పంటల నాణ్యతకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటి ఆధునిక పద్ధతులు పాటించాలని సూచించారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా నీటి వసతి కల్పించి, ఆర్గానిక్ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. ఆక్వా రంగం తరహాలోనే ఉద్యాన రంగాన్ని కూడా అగ్రస్థానానికి తీసుకెళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అరటి, బొప్పాయి, దానిమ్మ, మామిడి, ఉల్లి, టమాటా, మిరప వంటి పంటలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.సీమలో పండిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే ఈ ప్రణాళికలో కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. 'రైతులకు అవసరమైన కోల్డ్ చైన్, లాజిస్టిక్స్, రవాణా సదుపాయాలు కల్పించాలి. దుబాయ్ వంటి అంతర్జాతీయ కేంద్రాలకు ఎయిర్ కార్గో ద్వారా మన ఉత్పత్తులను తరలించాలి. అక్కడి నుంచి ప్రపంచంలోని ఇతర దేశాలకు ఎగుమతి చేయడం సులభమవుతుంది. ఇది సాకారమైతే ఈ ప్రాంత రైతుల భవిష్యత్తు మారిపోతుంది" అని చంద్రబాబు అన్నారు. దీనివల్ల ఉద్యాన సాగు సులభతరమై, రైతుల ఆదాయం పెరగడమే కాకుండా భూముల విలువలు కూడా పెరిగాయని, ఇందుకు తన సొంత జిల్లా అనంతపురమే ఉదాహరణ అని వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక, వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో అదానీ,
## అంబానీని దాటి పోవాలనుకుంటున్నారు

మొదటి పేజి తరువాయి

కూడా కూర్చుని తిన్నా తరగని ఆస్తిని వెనుకేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ భూకుంభకోణానికి తెరలేపారని అన్నారు. తక్కువ ధరకు 9,292 ఎకరాలను ధారాదత్తం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఇదివరకు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములలో ప్రైవేటు వ్యక్తులు అపార్టుమెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతిస్తోందని అన్నారు. గత ఐదారు దశాబ్దాలుగా హైదరాబాద్ నగరంలో 21 పారిశ్రామిక వాడలు ఏర్పడ్డాయని ఆయన గుర్తుచేశారు. ప్రజల భూములను తీసుకుని ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చాయని, నగరం విస్తరించడంతో పరిశ్రమలు నగరం మధ్యలోకి వచ్చాయని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీల ఏర్పాటుకు గ్రిడ్ పాలసీని తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వాడల భూములను విక్రయించి రూ.4 లక్షల కోట్లకు పైగా కుంభకోణం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 9,292 ఎకరాల భూమిని ధారాదత్తం చేసేందుకు రేవంత్ రెడ్డి సోదరులు, అనుయాయులు ఒప్పందాలు చేసుకున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదేనని, ముఖ్యంగా విద్యార్థులు ఈ దిశగా దృష్టి సారించాలని అన్నారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లింలందరికి న్యాయం జరుగుతుందా? అని ప్రశ్నించారు. తెలంగాణపై బీఆర్ఎస్ పార్టీకి ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని అన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన ఉద్ఘాటించారు.

## బాలకృష్ణ సినిమా వేడుకకు
## చీఫ్ గెస్ట్ గా సీఎం రేవంత్ రెడ్డి!

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది. ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కూడా మరో అతిథిగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈవెంట్‌కు రాలేకపోతున్నారని తెలిసింది. సినిమా విడుదలయ్యాక జరిగే సక్సెస్ మీట్‌లో బన్నీ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, 'జాజికాయ జాజికాయ' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు, డిసెంబర్ 4వ తేదీ రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్ షోలు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ఎదురుచూస్తోంది.

## కేంద్రమంత్రి వ్యాఖ్యలు..
## తేల్చేయాలంటూ అధిష్ఠానానికి సిద్ధరామయ్య సూచన

మొదటి పేజి తరువాయి



ఆది, కారంలోకి వచ్చాక సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, సిద్ధరామయ్య, డీ.కే. శివకుమార్ చెరో రెండున్నరేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారనే ప్రచారం మొదటి నుంచి ఉంది. ఈ క్రమంలో రెండవ దఫా సీఎంగా ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్‌కు అవకాశం ఉంటుందనే ప్రచారం కొంతకాలంగా కొనసాగుతోంది.పార్టీ పెద్దలు, సిద్ధరామయ్య, ఆయన వర్గం ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నప్పటికీ, ఊహాగానాలు మాత్రం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య ఈ అంశంపై మరోసారి స్పందించారు. ఇటువంటి ప్రచారానికి ముగింపు పలికేలా పార్టీ అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. సిద్ధరామయ్య ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని డీ.కే. శివకుమార్ చెబుతున్నప్పటికీ, ఆయన వర్గం ఎమ్మెల్యేల తీరు మాత్రం మరో విధంగా ఉంది. ప్రస్తుత కర్ణాటక కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై కేంద్ర మంత్రి కుమారస్వామి స్పందించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా తీవ్ర గందరగోళంలో ఉందని ఆయన అన్నారు. మరికొన్ని నెలల్లో అనూహ్య పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కుమారస్వామి వ్యాఖ్యల నేపథ్యంలో సిద్ధరామయ్య అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

## హక్కుల గురించి మాట్లాడతారు కానీ...
## బాధ్యతల గురించి ఆలోచించరు

మొదటి పేజి తరువాయి

ఎంపికైన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినం దించారు. ఈ మేరకు విద్యార్థి నిని, ఆమె కుటుంబ సభ్యులను ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించి మాట్లాడారు. మంగళగిరి బీఆర్ నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనక పుట్లమ్మ, పాఠశాలలో నిర్వ హించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, 'నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యువశక్తి ప్రాధాన్యత గురించి తరచూ చెబుతుంటారు. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలనే ఆలోచనను సీఎం గారితో చర్చించి నిర్ణయించాం" అని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని లోకేశ్ వివరించారు. "అమ్మకు చెప్పలేని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు నిన్నటి విలువల విద్యాసదస్సులో చక్కగా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. ప్రతి ఏటా స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని, కనకపుట్లమ్మను చూసి మరో పది మంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారని అన్నారు.

## అయోధ్య రామ మందిరంపై కాషాయ పతాకం..

మొదటి పేజి తరువాయి

ఈ జెండా 22 అడుగుల పొడవు, 11 అడుగుల వెడల్పు ఉంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఒక పారాచ్యూట్ నిపుణుడు దీన్ని తయారు చేశారు. సుమారు 2 నుంచి 3 కిలోల బరువుండే ఈ జెండా, ఎత్తైన ప్రదేశాల్లో బలమైన గాలులను సైతం తట్టుకునేలా రూపొందించబడింది. శ్రీరాముడి సూర్యవంశ వారసత్వానికి ప్రతీకగా సూర్యుడి చిహ్నంతో పాటు ఓం, కోవిదార వృక్షం గుర్తులు ఈ జెండాపై ఉన్నాయి. అంతకుముందు ప్రధాని మోదీ, భగవత్ వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీరామ దర్బార్ గర్భగృహంలో శ్రీరామ లల్లాకు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యకు చేరుకున్న ప్రధానికి ఘన స్వాగతం లభించింది. సాకేత్ కాలేజీ హెలిప్యాడ్ వద్ద సీఎం యోగి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని రోడ్‌షోలో పాల్గొని ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని ఆలయ ప్రాంగణంలోని సప్త మందిరాలను కూడా సందర్శించారు. మహర్షి వశిష్ఠ, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, అహల్య, నిషాదరాజ గుహ, మాతా శబరిలకు అంకితం చేసిన ఈ ఆలయాల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం శేషావతార్, మాతా అన్నపూర్ణ మందిరాల్లోనూ పూజలు నిర్వహించారు. ఈ పతాకం కేవలం మతపరమైన భక్తికి మాత్రమే కాకుండా భారతదేశ సనాతన సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నమని నేతలు పేర్కొన్నారు.

### డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ సమావేశాలు.. ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

మొదటి పేజి తరువాయి

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నవంబర్ 30వ తేదీన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ భేటీలో ప్రభుత్వం చర్చకు తీసుకురావాలనుకుంటున్న బిల్లులు, ఇతర ముఖ్యమైన అంశాలపై విపక్షాలకు వివరించి, వారి సహకారం కోరనుంది. డిసెంబర్ 1 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉంటాయి. అయితే, ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని సభలో బలంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సభలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం వంటి అంశాలపై చర్చించేందుకు విపక్షాలు కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద, ఈ సమావేశాలు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

### భారత్‌లో తాలిబన్ మంత్రి.. ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ దాడులు.. పది మంది మృతి

మొదటి పేజి తరువాయి

9 మంది చిన్నారులు సహా మొత్తం 10 మంది మరణించినట్లు తాలిబన్ ప్రభుత్వం ధ్రువీకరించింది. పలు ఇతర ప్రావిన్స్‌లపైనా ఈ దాడుల ప్రభావం ఉందని పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్ వాణిజ్య మంత్రి అల్హాజ్ నూరుద్దీన్ అజీజ్ ప్రస్తుతం భారత పర్యటనలో ఉండగా ఈ దాడులు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లోని పెషావర్‌లో నిన్న జరిగిన ఆత్మాహుతి దాడికి ప్రతీకారంగానే ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ప్రభుత్వం చాలా కాలంగా ఆరోపిస్తోంది. గతంలోనూ ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో పాకిస్థాన్ ఇలాంటి దాడులకే పాల్పడింది. అప్పుడు టీటీపీ చీఫ్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు పాక్ ప్రకటించింది. కీలకమైన సందర్భాల్లో పాక్ ఇలా దాడులకు దిగడం ఇరు దేశాల మధ్య వైరాన్ని మరింత పెంచుతోంది. ఇటీవల ఖతార్, తుర్కియేల మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, తాజా దాడులతో ఆ ఒప్పందం నీరుగారిపోయింది. ఈ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

### శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం : హోం మంత్రి

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత న్నారు.వెలగపూడి సచివాలయంలోని కార్యాలయంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ ఐపీఎస్, స్పెషల్ సెక్రటరీ విజయ్‌కుమార్ ఐపీఎస్, పీటీవో ఎస్పీతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిక్షణకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని శాంతిభద్రత పరిస్థితులు, నేర నియంత్రణ, టెక్నాలజీ వినియోగం, పోలీస్ విభాగానికి అవసరమైన వనరులపై సమగ్రంగా చర్చించారు. నేర నియంత్రణకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వసతుల విషయంలో ప్రభుత్వం రాజీపడదని స్పష్టం చేశారు. త్వరలోనే అన్ని పోలీస్ స్టేషన్లకు కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకురావడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజి తరువాయి

విలీనానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ఈ 27 మున్సిపాలిటీలు ,కార్పోరేషన్ లను జీహెఎంసీ లో కలపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీని అలాగే ఉంచాలా... లేక విభజించాలా అనేది భవిష్యత్‌లో నిర్ణయం తీసుకుంటాం.. రాబోయే పదేళ్ళకు సరిపడే విద్యుత్ అవసరం పై సుదీర్ఘంగా చర్చించాం. 2 వేల మెగావాట్ల పంప్ స్టోరేజ్ పవర్ కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్ వ్యవస్థ లో పారదర్శకత కోసమే కొత్త డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగా స్థాపించే పరిశ్రమలకు తామంతట తామే విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పించాలని నిర్ణయించాం. ప్రభుత్వ అంతర్గత విషయాలు బయటకు చెప్పేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ అంశంపై కూడా కేబినెట్ లో చర్చ జరిగింది. దీనికి పై ఎంక్వైరీ జరుగుతుంది అని శ్రీధర్‌బాబు అన్నారు.

ఇంకా కేబినెట్ నిర్ణయాలు ఏంటంటే..

విద్యుత్ ఉత్పాదన పెంచేందుకు 3 వేల మెగావాట్ల కోసం టెండర్లకు ఆహ్వానం,,హైదరాబాద్ లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్‌కు ఆమోదం,విద్యుత్ నెట్‌వర్క్ వైర్లన్నీ అండర్‌గ్రౌండ్‌లోనే ఉండేలా ప్రణాళిక అమలు,,రాష్ట్రంలో మూడో డిస్కం ఏర్పాటునకు ఆమోదం,మిషన్ భగీరథ, మెట్రో వాటర్ సప్లై కొత్త డిస్కం పరిధిలోకి,ఇప్పుడున్న విధానంలోనే పరిశ్రమలకు విద్యుత్ సరఫరా,సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఆమోదం రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సబ్ కమిటీ రికమండేషన్ ప్రకారమే ఇండస్ట్రియల్ పాలసీ జరిగింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల కాలుష్య రహిత నగరం గా మార్చడం కోసమే ఈ నిర్ణయం. గత ప్రభుత్వాలు ప్రయత్నాలు చేశాయి.. మేమూ చేస్తున్నాం. ఇది సరైన నిర్ణయం. హరీష్ రావు, కేటీఆర్ రాజకీయ విమర్శలు మానుకోవాలి. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు రెఫరెండం అని కేటీఆర్ సవాల్ చేశారు. గతంలో ఇండస్ట్రీ మినిస్టర్ గా కాలుష్య పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ కు అవతల వైపు మళ్లించాలని కేటీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఇండస్ట్రీ ఏరియా ను హౌసింగ్ ఏరియా మార్చి డబ్బులు దండుకున్నారు. కేటీఆర్ మాటల్లో రవ్వంత నిజం కూడా లేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనే ఔటర్ లోపల ఉన్న పరిశ్రమలు తరలించాలని నిర్ణయం తీసుకున్నాం. కాలుష్యం నుంచి హైదరాబాద్ ను బయటపడేందుకు పరిశ్రమల తరలింపు చేపట్టాం. జనాభా లేని చోటు కు పరిశ్రమలు తరలించడమే మా ప్రయత్నం. ప్రభుత్వం కు లబ్ది చేకూరే నిర్ణయం పై కేటీఆర్ విమర్శలు

# అమరావతి అద్భుతంగా ఉంది







**గాయత్రీ వార్తలు**

అతి పురాతన బౌద్ధ మ్యూజియం మహా స్తూపం ధ్యాన బుద్ధ విగ్రహం చాలా బాగున్నాయని సంతోషం వ్యక్తం చేసిన ప్రముఖ గుంటూరులోని సెయింట్ లారెన్స్ స్కూల్, విద్యార్థిని విద్యార్థులు ఈ రోజున అమరావతి సందర్శించి విద్యార్థులు విజ్ఞానాన్ని అక్కడ చారిత్రక విశేషాలను తెలుసుకున్నారు సంగ్రహాలయంలోని అతి పురాతనమైన వస్తువులను చూసి మంత్రముగ్ధులయ్యారు గుంటూరు కు చెందిన సెయింట్ లారెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత మేకల రవీంద్రబాబు డైరెక్టర్ శ్రీకర్, శేషు కుమారి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు అమరావతిని సందర్శించారు

# రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ జరిగింది









**గాయత్రీ వార్తలు**

రెండు దశల్లో రూ.260 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు జరుగనున్నాయి ఈ సందర్భంగా విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడుకు టీటీడీ సభ్యులు భారత్ బయోటెక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ టిటిడి సభ్యురాలు సుచిత్ర ఏల్లా కు,నన్నపనేని సదాశివరావు కు స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిసిన అఖిలభారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ )జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అద్భుతంగా తిరుమల శ్రీవారి ఆలయ నమూనాలు అభివృద్ధి చేసే దానికి శంకుస్థాపన చేయటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు అమరావతి ని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే దానికి పనులు శర వేగంగా జరిపే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెచ్ఆర్డి మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయం అన్నారు

# వైసీపీ మండలాధ్యక్షుడి తల్లిదండ్రులపై దుండగుల దాడి

- తల్లి మృతి తండ్రికి తీవ్రగాయాలు
- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శ

**శ్రీకాళహస్తి, గాయత్రీ వార్తలు :రిపోర్టర్: రంజిత్**



శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామంలో గురువారం తెల్లవారుజామున దారుణం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి తల్లిదండ్రులపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది.ఈ దాడిలో మధుసూదన్ రెడ్డి తల్లి జయమ్మ ఘోరంగా గాయపడి ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందగా, తండ్రి మహదేవ రెడ్డి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వెంటనే గ్రామానికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే, "ఇలాంటి దారుణానికి పాల్పడిన నిందితులను పోలీసులు వెంటనే గుర్తించి చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలి. కుటుంబం న్యాయం పొందే వరకు మా సంపూర్ణ మద్దతు ఉంటుంది" అని తెలిపారు.సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తో పాటు బర్రి సుదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి, రవీంద్రారెడ్డి, సురేష్, శేఖర్ రెడ్డి, నాధముని, శివ రెడ్డి, ముద్ధమూడి రవి, ఆర్కాడు ముత్తు, సుమన్, దిలీప్, మున్నా రాయల్, బుల్లెట్ జై శ్యామ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు

# బిజెపిలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త లోకేష్ యాదవ్



**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు : రిపోర్టర్ : రంజిత్**

శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త లోకేష్ యాదవ్ భారతీయ జనతా పార్టీలో చేరారు. శ్రీకాళహస్తి బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భం లో మాట్లాడుతూ లోకేష్ యాదవ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. "ప్రపంచ దేశాలు కూడా గర్వించదగ్గ నాయకుడు మన ప్రధాని మోడీగారు. ఆయన నాయకత్వం, దేశం అభివృద్ధి పథంలో సాగుతున్న తీరు నాకు ఎంతో నచ్చింది. అందుకే బిజెపిలో చేరాలని నిర్ణయించుకున్నాను" అని అన్నారు.లోకేష్ యాదవ్ పార్టీకి చేరడంతో స్థానిక బిజెపి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు

# కడప జిల్లాలో ఎండిపిఎస్ ముఖ్య నాయకుల సమావేశం




- రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి శేఖర్

**కడపజిల్లా, గాయత్రి వార్తలు రిపోర్టర్ : మునిరత్నం**

ఎం.డి.పి.ఎస్ (మాదిగ దళ పోరాట సమితి) ముఖ్య నాయకుల సమావేశం కడప జిల్లాలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎండిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కలిసి కడప జిల్లాలో పర్యటిస్తూ మాదిగ దళ పోరాట సమితి కార్యకర్తలతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. సమాజ అభ్యున్నతి, సమస్యల పరిష్కారం, సభ్యుల ఐక్యత, భవిష్యత్ కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. మహిళా గౌరవ అధ్యక్షురాలిగా జమ్మలమడుగుకు చెందిన అన్నపురెడ్డి రాణి ఎల్.ఎల్.బి. నియామకం సమావేశంలో జమ్మలమడుగుకు చెందిన అన్నపురెడ్డి రాణి ఎల్.ఎల్.బి గారిని ఎండిపిఎస్ రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలిగా నియమించడం జరిగింది. ఈ నియామకంపైజిల్లా, రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా గౌరవ అధ్యక్షురాలు రాణికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు. మరియు పెద్దపల్లి శేఖర్ నాయకత్వం వర్ధిల్లాలని, మాదిగ సమాజ అభివృద్ధి దిశగా ప్రతి సభ్యుడు కట్టుబడి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి "ప్రజాదర్బార్"

**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్**



శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు, వాటి పరిష్కారానికి మార్గాలు కనుగొనడానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రత్యేకంగా ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేశారు. రేపు (28-11-2025) ఉదయం 9:30 గంటలకు పట్టణంలోని గెస్ట్ హౌస్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారాలు సూచించడం ఈ దర్బార్ ప్రధాన ఉద్దేశ్యమని సుధీర్ రెడ్డి తెలిపారు. అధికారులు%-%ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు చేరి నేరుగా స్పందించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని పేర్కొన్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.

# భూపతి అకాల మరణం విచారం మిన్నల్ రవి నివాళులు



**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు : రిపోర్టర్ : రంజిత్**

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకుడు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వి. భూపతి ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో మృతి చెందడం తీవ్ర విషాదానికి గురిచేసింది. కుప్పంలోని వారి స్వగృహంలో భూపతి భౌతికకాయానికి పలువురు నేతలు శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా భూపతి మృతదేహానికి నివాళులు అర్పించిన డైరెక్టర్ మిన్నల్ రవి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. భూపతి మరణం తీరని లోటు అని, ఎంతో తక్కువ సమయంలో సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగిన భూపతి ఇలా అర్ధాంతరంగా ఇకలేరనడం హృదయవిదారకం అని ఆవేదన వ్యక్తం చేశారు.భూపతి మరణం తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాకుండా వన్నెకుల క్షత్రియ సమాజానికీ పెద్ద లోటు అని ఆయన పేర్కొన్నారు.భూపతి మృతి రాష్ట్రంలో చోటుచేసుకున్న అనేక నాయకుల సందర్శనలకు కారణంగా మారింది. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు నేతలు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ సెల్వరాజు, డైరెక్టర్ మిన్నల్ రవి, కె.ఎం. వేణుగోపాల్, సెల్వం, రామకుప్పం మండల టిడిపి అధ్యక్షులు వెంకటరమణ, వన్నెకుల క్షత్రియ సంఘం మండల అధ్యక్షులు జయన్న, కుప్పం మున్సిపాలిటీ వన్నెకుల క్షత్రియ అధ్యక్షులు నాగేంద్ర, కుప్పం సింగల్ విండో అధ్యక్షులు కృష్ణమూర్తి, కుప్పం తిరుపతి గంగమ్మ దేవస్థానం డైరెక్టర్ శరవణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను దూరం చేస్తాం: ఎమ్మెల్యే



ఆదోని నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే ప్రజల సమస్యలు దూరం చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. అమరావతినగర్‌లో రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి వార్డు కౌన్సిలర్ లలితా మధుసూదన్ శర్మతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల్లో కాలనీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. త్వరలో మంచి రోజులు వస్తాయని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు దూరమవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉపేంద్ర, నూర్జహాన్, పరుశురాం, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఓటీటీలోకి 'డ్యూడ్' సినిమా!





లవ్ టుడే, డ్రాగన్ లాంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్. ఇతడి నుంచి వచ్చిన లేటెస్ట్ మూవీ 'డ్యూడ్'. దీపావళి సందర్భంగా గత నెలలో థియేటర్లలోకి వచ్చింది. మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్నప్పటికీ రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు నిర్మాతలు ప్రకటించారు. అలాంటిది ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైపోయిందట. ఈ మేరకు డేట్ వైరల్ అవుతోంది. 'డ్యూడ్' చిత్రంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించారు. శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. పరువు హత్యల బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ చిత్రంలో ఆర్య సినిమా పోలికలు ఉన్నాయని చెప్పి సోషల్ మీడియాలో టాక్ వినిపించింది. దర్శకుడు కూడా ప్రమోషన్స్‌లో మాట్లాడుతూ.. ఈ కథకు ఆర్య-2 సినిమా స్ఫూర్తి అన్నట్లు చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ మూవీ.. నవంబరు 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లోకి రానుందని సమాచారం. విడుదలకు ముందు 'డ్యూడ్' ఓటీటీ హక్కుల డీల్ జరిగిపోయింది. థియేటర్లలో రిలీజైన నాలుగు వారాల తర్వాత స్ట్రీమింగ్ చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారట. ఈ క్రమంలోనే ఈనెల 14 నుంచి సినిమాని స్ట్రీమింగ్ చేసే అవకాశముంది. తెలుగు, తమిళ భాషలతో పాటు మిగతా దక్షిణాది భాషల్లోనూ అందుబాటులోకి రావొచ్చు. 'డ్యూడ్' విషయానికొస్తే.. గగన్ (ప్రదీప్ రంగనాథన్).. ఆముద(నేహాశెట్టి)ని ఇష్టపడతాడు. కానీ ఆమె మరొకరిని పెళ్లి చేసుకుంటుంది. మరోవైపు మేనమామ కూతురు కుందన (మమిత బైజు)కి చిన్నప్పటినుంచి గగన్ అంటే ఇష్టం. కానీ గగన్‌కి ఎలాంటి ఫీలింగ్స్ ఉండవు. కుందన పెళ్లి ప్రపోజల్ తెచ్చినా రిజెక్ట్ చేస్తాడు. ఆ బాధలో పార్థు(హృదయ్)ని కుందన ఇష్టపడుతుంది. కానీ అనుకోని పరిస్థితుల్లో కుందన, గగన్‌కి పెళ్లవుతుంది. కానీ ఆమె మనసులో పార్థు ఉన్నాడని గగన్‌కి తెలుసు. దీంతో కుందన, ఆమె ప్రియుడిని కలిపే పనిలో ఉంటాడు. చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.

# ఎన్నో పోరాటాలు చేశా!


సినిమా ఇండస్ట్రీలో కొనసాగాలంటే పురుషాహంకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈ విషయంలో తాను ఎన్నో పోరాటాలు చేశానని జాన్వీ కపూర్ వెల్లడించారు. 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో సినిమా ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న కొన్ని సమస్యలపై జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. "ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ నుంచే నేను ఇండస్ట్రీకి వచ్చినప్పటికీ.. ఇక్కడికి వచ్చాకే కొన్ని కొత్త విషయాలు నేర్చుకున్నాను. సినిమా ఇండస్ట్రీలో రాణించాలంటే పురుషాహంకారాన్ని ఎదుర్కోవాలి. ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నా అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పగలను. అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నా అభిప్రాయాన్ని నేను స్వేచ్ఛగా చెప్పలేక పోతున్నాను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా చె ప్పాలి. ఇందుకు చాలా నేర్పు కావాలి. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. కొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను నచ్చలేదని స్ట్రయిట్‌గా చెప్పకుండా నాకు అర్థం కావడం లేదు అని చెప్పుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. కొన్నిసార్లు మౌనంగా ఉండి పోవాల్సి వచ్చింది. ఇలా ఎన్నో రాజకీయాలను ఎదుర్కొన్నాను" అని చెప్పుకొచ్చారు జాన్వీ కపూర్. ఈ షోకు ఓ వ్యాఖ్యాతగా ఉన్న ట్వింకిల్ ఖన్నా కూడా జాన్వీ కపూర్ మాటలను స పోర్ట్ చేస్తూ, 1990 సమయంలో తాను ఈ తరహా పరిస్థితులను ఫేస్ చేశానని చె ప్పారు.

# షారుక్ ఖాన్ ఫిల్మ్ ఫెస్టివల్



బర్త్ డేకి ఫ్యాన్స్‌కు స్పెషల్ ట్రీట్ ప్లాన్ చేశారు షారుక్ ఖాన్. నవంబరు 2న షారుక్ 60వ బర్త్ డే. ఈ సందర్భంగా 'షారుక్ ఖాన్ ఫిల్మ్ ఫెస్టివల్' పేరిట షారుక్ నటించిన కొన్ని సూపర్‌హిట్ సినిమాలు ఈ నెల 31 నుంచి థియేటర్స్‌లో ప్రదర్శితం కానున్నాయి. "అక్టోబరు 31న ఈ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం అవుతుంది. 'దిల్ సే, దేవ్‌దాస్, మై హూ నా, ఓం శాంతి ఓం, చెన్నై ఎక్స్‌ప్రెస్'... ఇలా నా కెరీర్‌లోని కొన్ని సూపర్‌హిట్ సినిమాలు థియేటర్స్‌లో మళ్లీ ప్రదర్శితం కానున్నాయి. ఈ సినిమాల్లోని మనిషి (తనను తాను ఉద్దేశించి) మారలేదు. జస్ట్ హెయిర్ మాత్రం మారింది. ఇంకాస్త అందంగా తయారయ్యాడు. పీవీఆర్ ఐనాక్స్ అసోసియేషన్‌తో భారతదేశంలోని కొన్ని థియేటర్స్‌లో మాత్రమే ఈ సినిమాలు ప్రదర్శితం అవుతాయి. నార్త్ అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, యూరప్ దేశాల్లో వైఆర్‌ఎఫ్ (యశ్‌రాజ్ ఫిల్మ్స్) సంస్థ ఈ సినిమాలను రిలీజ్ చేస్తోంది" అని షారుక్ పేర్కొన్నారు. అక్టోబరు 31న ప్రారంభమయ్యే ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నవంబరు 14 వరకు కొనసాగుతుందట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం 'కింగ్' సినిమాతో షారుక్ బిజీగా ఉన్నారు. ఈ చిత్రంతో ద్వారా కుమార్తె సుహానా నటిగా పరిచయం కానున్నారు.

# ఇండియాలో అవతార్ ఈవెంట్



'అవతార్' ఫ్రాంచైజీ నుంచి రానున్న తాజా చిత్రం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' . సామ్ వర్తింగ్టన్, జో సాల్డానా, సిగోర్నీ వీవర్, స్టీఫెన్ లాంగ్, ఊనా చాప్లిన్, కేట్ విన్స్లెట్ ఈ చిత్రంలోని ప్రధాన తారాగణంగా నటించగా, క్లిఫ్ కర్టిస్, డేవిడ్ థెవ్లిస్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. జేమ్స్ కామెరూన్, జాన్ లాండౌ నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా ఇంగ్లీష్‌తో పాటు కొన్ని భారతీయ భాషల్లోనూ విడుదల కానుంది. తెలుగులో కూడా విడుదలవుతోంది. కాగా, ఈ 'అవతార్: ఫైర్ అండ్ యాష్'కు సంబంధించి ఇండియాలో ఓ పెద్ద ఈవెంట్‌ను ప్లాన్ చేస్తారట మేకర్స్. మరోవైపు ఇండి యాలో 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సినిమా ప్రదర్శితం కానున్న థియేటర్స్‌లో 'అవతార్' ఫ్రాంచైజీ సినిమా అభిమానులు కొందరు 'అవతార్' సినిమా లోగోను దీపాల రూపంలో వెలిగించి, హ్యాపీ ఫీలయ్యారు. ఇక 2009లో వచ్చిన 'అవతార్', 2022లో వచ్చిన 'అవతార్ 2 (అవతార్: ది వే ఆఫ్ వాటర్) ప్రేక్షకులను మెప్పించి, రికార్డు స్థాయి వసూళ్లను సాధించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు 'అవతార్ 3' రానుంది. అలాగే 'అవతార్ 4, అవతార్ 5' చిత్రాలూ ప్రేక్షకుల ముందుకు రానున్న విషయాన్ని దర్శకుడు జేమ్స్ కామెరూన్ కన్ఫార్మ్ చేసిన విషయం తెలిసిందే.



# అభిమానులకు అంకితం

ప్రతిష్ఠాత్మక అవార్డ్‌ను తన అభిమానులకు అంకితమిస్తున్నానని అల్లు అర్జున్ ట్వీట్ చేశారు. ఇలాంటి ?అరుదైన గౌరవమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది అవార్డులు పొందిన వారికి హృదయపూర్వక అభినందనలు చెబుతూ ఐకాన్ స్టార్ ట్వీట్ చేశారు. 2024 ఏడాదిగానూ ప్రకటించిన దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ?అవార్డులను తాజాగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల్లో మోస్ట్ వర్సటైల్ యాక్టర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా పుష్ప-2 మూవీకి గానూ ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవీశ్రీ ప్రసాద్ అవార్డ్ దక్కించుకున్నారు. ఈ అవార్డ్స్‌లో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ సినిమా సత్తా చాటింది. దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ -2025లో ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. గతేడాది విడుదలై ప్రేక్షకుల్ని భయంతో పరుగులు పెట్టించిన శ్రద్ధాకపూర్ మూవీ స్త్రీ- 2 ఉత్తమ చిత్రంగా అవార్డును దక్కించుకుంది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా కార్తీక్ ఆర్యన్, కృతి సనన్ నిలిచారు. చందు ఛాంపియన్ చిత్రానికి గానూ ఉత్తమ దర్శకుడిగా కబీర్ ఖాన్, ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్‌గా దినేశ్ విజన్ అవార్డులు సొంతం చేసుకున్నారు. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ చిత్రంగా లాపతా లేడీస్, ఉత్తమ నటీనటులుగా విక్రాంత్ మాస్సే, నితాన్షీ గోయెల్ అవార్డులు దక్కించుకున్నారు. ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్‌గా ఏఆర్ రెహమాన్ నిలిచారు.

# బాలీవుడ్ ఎంట్రీ?

తమిళ హీరో శివ కార్తికేయన్ బాలీవుడ్ ఎంట్రీ దాదాపు ఖరారు అయిందనే టాక్ తెరపైకొచ్చింది. 'దేవదాస్, రామ్‌లీల, పద్మావత్' వంటి సూపర్‌హిట్ సినిమాలను తెరకెక్కించిన బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఆఫీస్‌కు వెళ్లొచ్చారు శివ కార్తికేయన్. దీంతో భన్సాలీతో ఈ హీరో ఓ సినిమా చేయనున్నారనే టాక్ బాలీవుడ్‌లో ఊపందుకుంది. మరి... భన్సాలీ దర్శకత్వంలోని సినిమాలో శివ కార్తికేయన్ హీరోగా నటిస్తారా? లేక శివ కార్తికేయన్ హిందీలో నటించే తొలి సినిమాకు భన్సాలీ నిర్మాతగా ఉంటారా? అనే విషయాలపై ఓ స్పష్టత రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిందీ చిత్రం 'లవ్ అండ్ వార్'తో బిజీగా ఉన్నారు సంజయ్ లీలా భన్సాలీ. ఈ సినిమా రిలీజ్ తర్వాత శివ కార్తికేయన్‌తో భన్సాలీ సినిమా గురించి ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

